క్లుప్తంగా

వైభవంగా పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి వైభవంగా పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారి తిరునక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా 108 వెండి కలశాలలో పంచామృతాలు ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, అర్చకులు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి స్వామిఅమ్మవార్లకు అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు

తుని రూరల్: ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండల పరిషత్ పాలక వర్గం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా నిపుణులైన పది మంది వైద్యులతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తుని, పాయకరావుపేటకు చెందిన వైద్యులు ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు, ఉద్యోగులకు పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. ఉచిత వైద్యసేవలు అందించిన డాక్టర్లను ఎంపీపీ డాక్టర్ రాము, వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, జెడ్పీటీసీ పోతల సూర్యమణి శాలువాలతో సత్కరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్, అంగన్‌వాడీ, మండల పరిషత్, తేటగుంట, ఎస్.సూరవరం పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

కోటనందూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈరుగుల లోవరాజును ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు, అందుతున్న చికిత్స తదితర విషయాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం అందజేశారు. ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కురందాసు రాంబాబు, ఉల్లూరి కనకదుర్గశ్రీను పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

తుని: డెంగీ జ్వరాల నివారణపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక రెండో వార్డులో మున్సిపల్ శానిటరీ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. డెంగీ వ్యాధి వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వార్డు కౌన్సిలర్ చింతల సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఆర్ శేఖర్, సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: పెద్దిపాలెం గ్రామ శివారు కిత్తమూరిపేట గిరిజన గ్రామంలో నిర్మించుకున్న ఇళ్లకు భూ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ ఆగ్రామ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ప్రత్తిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ జీ.చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ కిత్తమూరిపేట గ్రామంలోని సర్వే నంబరు 200లో గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల వంతున పంపిణీ చేశారని, ఎన్నో ఏళ్లుగా పాకల్లో నివాసం ఉంటున్న ఈ గిరిజనలు పక్కా ఇళ్ల నిర్మాణానికి భూ హక్కు పత్రాలు మంజూరు చేయాలని రేచుకట్ల సింహాచలం కోరుతున్నారు.

29న కౌన్సిల్ సమావేశం

తుని: ఈ నెల 29వ తేదీన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో సీపీ ఏలూరి సుధారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఐదుగురి అరెస్టు

జగ్గంపేట: భావవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. వారి నుంచి రూ.65,300 స్వాధీనం చేసుకుని, మూడు మోటారుసైకిళ్ల సీజ్ చేశామన్నారు.

టీడీపీ పాదయాత్ర

ఏలేశ్వరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మంగళవారం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ నుంచి యర్రవరం వరకూ సుమారు 7 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. అనంతరం యర్రవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు.

అంగన్‌వాడీల ధర్నా

తుని: సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో తలపెట్టిన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శివకుమార్‌కు అందజేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోఅంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన నిర్వహించారు.

కిర్లంపూడి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కుశరాజుకు వినతిపత్రం అందజేశారు.

పల్లెల్లోనే పశువైద్యం

- రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు
- పశుపోషణతో పాడిరైతుల ఆర్థికాభివృద్ధి



పాడిగేదెలకు పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి వీర్రాఘవరావు

రౌతులపూడి: ఒకప్పుడు పశువులకు ఏ జబ్బు వచ్చిందో, ఎందుకు మృతి చెందిందో తెలియదు. అరకొరగా ఉన్న పశువైద్యశాలలతో ఉపయోగం ఉండేది కాదు. ఏమైందో తెలుసుకునే లోపు రైతులు పాడి సంపదను కోల్పోయేవారు. ప్రస్తుత ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా పశువులకు ముందస్తు వైద్య సేవలు, రైతులకు పథకాలు అందిస్తోంది. పశుపోషణ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

మండలంలో మొత్తం పాడి సంపద

20వ అఖిల భారత పశుసంపద గణాంకాల ప్రకారం మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 2,790 ఆవులు, 11,688 గేదెలు, 16460 మేకలు, గొర్రెలు ఉన్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా సీజన్లలో సాధారణంగా జబ్బవాపు, గొంతువాపు, గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లా, థైలేరియా వంటి వివిధ రకాల వ్యాధులు పశువులకు సంక్రమిస్తుంటాయి. వాటిని ఎదుర్కొని, పాడిని కాపాడుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసి ఆదుకుంటోంది.

వైద్యసేవలు ఇవే..

గేదెలు, ఆవుల అబార్షన్‌ను నిరోధించడానికి ముందస్తుగా మార్చి, జూలైలలో టీకాలు, మేలో గాలికుంటు వ్యాధి నివారణకు, ఆగస్టులో థైలేరియా(లంపి గ్రంథులు రాకుండా నివారణ చర్యలు)టీకాలు, జబ్బవాపు, గొంతువాపు, భూస్టర్ డోస్ టీకాలు, నవంబర్‌లో బ్రుసెల్లా (నాలుగు, ఎనిమిది నెలల ఆడదూడలకు), డిసెంబర్‌లో గాలికుంటు వ్యాధి నివారణకు రెండో దఫా టీకాలు వేసేందుకు పశువైద్యాధికారులు సేవలందిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల వద్ద సేవలు

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పశువులకు వైద్య సేవలందిస్తోంది. పశువులకు ప్రథమ చికిత్స, కృత్రిమ గర్భధారణ, చూలు పరీక్ష, వివిధ రకాల జబ్బులకు ముందస్తుగా టీకాలు వేస్తోంది. నట్టల నివారణ, గొడ్డు మోతు పశువులను గుర్తించి పశువైద్యుని సలహా మేరకు చికిత్సనందిస్తోంది. అలాగే పశుపోషణకు గడ్డివిత్తనాలను సబ్సిడీపై ఇవ్వడం, సమీకృతల దాణా, కాల్షియం, మినరల్ మిక్చర్, పాల పితుకు యంత్రాలు, గడ్డి కత్తిరించు యంత్రాలు సబ్సిడీపై సరఫరా చేస్తోంది. ఆసరా, చేయూత పథకాల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పశువులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం, ఆరోగ్య కార్డులు జారీ చేస్తోంది. ఇనాఫ్ ట్యాగ్‌వేయడం, పశువైద్యుని పర్యవేక్షణలో విత్తులు నొక్కుట, పశువిజ్ఞాన బడులు నిర్వహించడం చేస్తోంది.

జగనన్న పాలవెల్లువ

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహిస్తున్న జగనన్న పాలవెల్లువ(జగనన్న పాలసేకరణ కేంద్రాలు)తో రైతులు మరింత ముందడగు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా 14 జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు పాలు సరఫరా చేసే రైతులు ఆర్థికంగా మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ పథకంలో పాడిరైతులను చైతన్యపరచి ఆర్థికంగా భరోసా కల్పించడ వంటి చర్యలు చేపట్టారు.

సమయానికి వైద్యం అందడంతో..



గత మూడేళ్లుగా రైతు భరోసా కేంద్రాల వద్ద, మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాల వద్ద పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయి. పశువులకు సరైన సమయానికి టీకాలు అందిస్తున్నారు. ఆర్బీకే పశువైద్య సిబ్బంది అందుబాటులోఉండడంతో పశువులకు సకాలం చికిత్స చేయిస్తూ పశువులను ఆరోగ్యవంతంగా చూడగలుగుతున్నాం.

– నాకిరెడ్డి అప్పలనాయుడు, పాడి రైతు ఎ.మల్లవరం

జాగ్రత్తలు పాటించాలి



పశువులకు కాలానుగుణంగా సంక్రమించే వ్యాధులపై రైతులు వైద్యులు సూచనల మేరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. మెట్టప్రాంతంలో తరచుగా వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తు సేవలందించాలి. పశువుల వ్యాధులను ముందుగా గ్రహిస్తే సరైన వైద్యం అందిస్తే వాటిలో పాల ఉత్పత్తి పెరుగుతుంది. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని పశుపోషణ, పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవాలి

– డాక్టర్ ఎం.వీర్రాఘవరావు, మండల పశువైద్యాధికారి, రౌతులపూడి

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి



సాయినగర్‌లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి, బాలు

తుని: రాష్ట్రంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు సంక్షేమ పథకాలను సమానంగా అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఏలూరి సుధారాణి కోరారు. మంగళవారం 30వ వార్డులో కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరి వనజ ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ –మన బాధ్యత కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్ల వ్యవధిలో ప్రభుత్వ పరంగా కుటుంబానికి ఏమేర ప్రయోజనం చేకూరిందో వివరించారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో పట్టణంలోని అనిన ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, జిలా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డాక్టర్ అన్వేషికి సత్కారం



డాక్టర్ అన్వేషిని సత్కరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు

తుని రూరల్: తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.అన్వేషిని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన, మెరుగైన వైద్యసేవలు అందించినందుకు ఇటీవల తేటగుంట పీహెచ్‌సీకి క్వాలిటీ సర్టిఫికెట్‌ను కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించింది. ఇందుకు కారకురాలైన డాక్టర్ అన్వేషిని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, మండల వ్యవసాయ సలహ మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, ఎంపీడీఓ రవికుమార్, నాయకులు పోతల రమణ, దుంగల నాగేశ్వరరావు శాలువాలు, పూలబొకెలతో అభినందించారు. ప్రజల సహకారం, సిబ్బంది సమిష్టి కృషితో క్వాలిటీ సర్టిఫికెట్ సాధించగలిగామని డాక్టర్ అన్వేషి పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో మరింతగా సేవలు అందిస్తామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ పనితీరుపై ఆగ్రహం

- వాడీవేడిగా మండల సమావేశం
- ప్రజా సమస్యలపై సమీక్ష



తుని మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ రాము

తుని రూరల్: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని, ప్రజాప్రతినిధుల చేసిన ఫోన్లకు సైతం స్పందించకపోవడంపై ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ట్రాన్స్‌కో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ఏఈకి ఫోన్ చేస్తే స్పందించడం లేదని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు ఆరోపించారు. వాస్తవమేనంటూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఏకరువు పెట్టారు. తాను ఫోన్ చేసిన స్పందించడం లేదని పేర్కొంటూ ఎంపీపీ రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలు తమ వద్దకు వస్తున్నారని, తాము ఫోన్ చేసిన మాట్లాడకపోవడం ఏంటని ఎంపీపీ ఏఈ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఇటీవల ఈదురు గాలులకు ఎస్.అన్నవరం, గెడ్లబీడు, వల్లూరుల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయన్నారు. పునరుద్ధరించడంలో స్థానికంగా ఉండే ఎనర్జీ సిబ్బంది అందుబాటులో లేరని, ఏఈకి చెప్పినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సమావేశపు సమాచారం ఇచ్చినా హాజరుకాని శాఖల అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్‌కు సూచించారు. సొంత స్థలాల్లో 1200 ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి లభించిందని, హౌసింగ్ ఏఈ ముద్రగడ నాయుడు తెలియజేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామీణులు అప్రమత్తంగా ఉండేలా ప్రజా ప్రతినిధులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఎస్.సూరవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే నిర్వహించాలన్నారు. సమగ్ర భూ సర్వేకు సహకరించేలా గ్రామీణుల్లో అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ సభ్యులను కోరారు. ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకువచ్చిందని, దాంతో టైటిల్ గ్యారంటీ యాక్టు అమలులోకి వచ్చిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో 50 శాతం వరి నాట్లు పూర్తకాలేదని ఏఓ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెలాఖరుతో ఖరీఫ్‌లో పంట నమోదు (ఈ–క్రాప్ బుకింగ్) పూర్తవుతుందన్నారు. మండలంలో 12,704 మందికి రైతు భరోసా నిధులు జమవుతున్నాయని, ఇంకా ఎవరైనా ఉంటే వారం రోజుల్లో నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఈనెల 30 నుంచి నవంబరు ఒకటి వరకూ జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ డాక్టర్ రాము పిలుపునిచ్చారు. పెరిక కార్పరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, వైస్ ఎంపీపీ చిటికెల సత్యవతి. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, మండల వ్యవసాయ సలహ మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి



దానవాయిపేట బీచ్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్

తొండంగి: సముద్ర తీరప్రాంతంలో జరిగే గణేష్ నిమజ్జనాల్లో భక్తులు జాగ్రత్తలు పాటించాలని అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ సూచించారు. మండలంలో దానవాయిపేట, పెరుమాళ్లపురం బీచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో నిమజ్జనాలు సందర్భంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ప్రమాదం జరిగి నరుగురు యువకులు గల్లంతైన చొత్తచోడిపల్లిపేట బీచ్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. బీచ్‌లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అనుమతి లేని ప్రాంతాల్లో నిమజ్జనాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై జీ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: గణపతి నిమజ్జనంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామరావు అన్నారు. జగ్గంపేట శివారు గుర్రంపాలెంరోడ్డులో పుష్కర కాలవ, రామవరం శివారులో కాలువ ప్రదేశాలను మండల అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు వివరించారు. ఎంపీడీఓ వసంతకుమార్, జగ్గంపేట తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయండి



పారుపాకలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న మల్లికార్జునరావు

రౌతులపూడి: గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పారుపాక, కోడూరు, లచ్చిరెడ్డిపాలెం, గిడజాం, రౌతులపూడి గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు. ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి పి.అరుణ్‌కుమార్, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుపై అవగాహన

శంఖవరం: రైతులకు ఈ–క్రాప్ నమోదుపై అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.మల్లికార్జునరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని పి.మల్లాపురం, జి.కొత్తపల్లి, వి.వెంకటాపురం, అచ్చంపేట, శంఖవరం, గౌరంపేట గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రైతుల భరోసా, పంట నష్టపరిహారం తదితర పథకాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్, వ్యవసాయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



తునిలో స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న ఏలూరి బాలు

తుని: ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ యువత అధ్యక్షుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు మాట్లాడుతూ మంత్రి దాడిశెట్టి రాజా ప్రోత్సాహంతో డిస్ట్రిక్ట్ లెవల్లో జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో తుని నుంచి 30 క్రీడాకారులు పాల్గొనగా 9 మంది క్రీడాకారులు 19 మెడల్స్ సాధించారన్నారు. వీరిలో ఐదుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను, వారికి తర్ఫీదునిచ్చిన కోచ్‌లను ఆయన అభినందించారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రౌతులపూడి: త్వరలో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు రౌతులపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.చరణ్ ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు తెలిపారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో అండర్–17 బాలురు విభాగంలో త్రోబాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్టు ఆయన తెలిపారు. చరణ్‌ను ఎంఈఓలు శ్రీనివాసు, కొండబాబు, హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

సచివాలయాల పరిశీలన



గెద్దనాపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని గెద్దనాపల్లి–1, భూపాలపట్నం సచివాలయాలను రాజేశ్వరరావు సందర్శించారు. బయోమెట్రిక్ హాజరు వివరాలను ఆయన పరిశీలించారు. విధి నిర్వాహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం గెద్దనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, గర్భిణులకు మంగళవారం తహసీల్దార్ సుగుణ చేతుల మీదుగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సామాజిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతుల సహకారంతో సుమారు 200 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, ఇనకోటి బాపన్నదొర, హేమంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దీపాలను వెలిగిస్తున్న భక్తులు



దీపాలతో శివలింగం వెలిగిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న దీపోత్సవం

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన దీపాలంకరణ ఆకట్టుకుంది. స్థానిక మార్కెట్ వీధిలో వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో భక్తులు వినాయకుడు, శివలింగం, స్వస్తిక్, ఓంకారం ఆకారంలో దీపాలను వెలిగించారు. వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్, ఎంపీసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

జగ్గంపేట: గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వీధిలో దీపోత్సవం నిర్వహించారు.



స్వస్తిక్ ఆకారంలో..



ఓంకారం ఆకారంలో..

భర్త వేధింపులపై ఫిర్యాదు

రౌతులపూడి: పారుపాకలో నివాసం ఉంటున్న మహిళ తన భర్త కె.కృష్ణ కొంత కాలంగా మానసికంగా వేధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మంగళవారం ఫిర్యాదు చేసినట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబి తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

గండేపల్లి: భర్త మానసికంగా వేధిస్తున్నాడని గండేపల్లికి చెందిన యమసాని ఝాన్సీ మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. భర్త వెంకటకిష్టారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలియజేశారు.

పాషా పోరాటాలు స్ఫూర్తిదాయకం

జగ్గంపేట: గ్రామ శివారు స్టాలిన్ భవనంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ ఆధ్వర్యంలో కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ ఎస్‌కే ముఖ్తార్ పాషా, శ్రీకాకుళం సాయిధ పోరాటా యోధురాలు కామ్రేడ్ పైలా చంద్రమ్మల శివర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాషా రాష్ట్రంలోని పెంకు కార్మికుల కోసం చేసిన ఉద్యమాలు, వారికి చేకూరిన లాభాలు గురించి వివరించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏసు,పివైఎల్ రాష్ట్ర నాయుకులు వి.చిట్టిబాబు,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయుకులు కె.లక్ష్మి, పిఓడబ్ల్యు అధ్యక్షురాలు వి.శాంతి,వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

జాతి సమైక్యతే లక్ష్యంగా విద్యార్థినుల ర్యాలీ



జాతి సమైక్యతను వెలుగెత్తుతూ నినాదాలు చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

తుని రూరల్: జాతి సమైక్యతే లక్ష్యం కావాలని వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం కేజీబీవీ విద్యార్థినులు, ఉపాధ్యాయులు మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జండాలను, జాతీయ నాయకులు, స్వతంత్ర సమరయోధుల చిత్రపటాలను పట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భారతమాత వేషధారణలో బాలిక ఇంటింటా మట్టిని సేకరించారు. భవితరాలకు జాతి సమైక్యత తెలిసేలా ఐక్యతను చాటాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ట్రయల్ రన్ సక్సెస్



ప్రత్తిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం నిర్వహించిన «జగనన్న ఆరోగ్య సురక్ష» ట్రయల్ రన్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ప్రత్తిపాడు – 1 సచివాలయం పరిధిలో నిర్వహించిన ఈ ట్రయల్ రన్‌లో వివిధ విభాగాల వైద్యులు సుమారు 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించారు. ఈశిబిరంలో డయాబెటీస్, బీపీ, రక్తహీనత, కళ్లి, బాలింతలకు, గర్భిణులకు వైద్య, రక్త పరీక్షలు చేశారు. అలాగే ఎముకల, చెవి, ముక్కు, కన్ను, పళ్ళు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జాయింట్ డైరెక్టర్ నరసింగరావు, డీఎం అండ్ హెచ్ఓ జె.నరసింహనాయక్, రాష్ట్ర బాల సురక్ష కార్యక్రమం పీఓ కె.సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేకాధికారిణి పావణి, డీఎల్‌డీఓ కేఎన్‌వీ ప్రసాద్, జిల్లా అంధత్వ నివారణా సంస్థ అధికారిణి పద్మదీపిక తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైద్యాధికారి పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ జె.నరసింహనాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.రాంబాబు నాయక్, టీ.సాయిహేమశ్రీ, సూపర్ వైజర్లు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.